గో సంరక్షణకు కృషి చేయాలి



గవర్నర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న జంతు సంరక్షణ సంస్థల ప్రతినిధులు

సుల్తాన్‌బజార్: గో సంరక్షణకు కృషి చేయాలని వివిధ జంతు సంరక్షణ సంస్థల సభ్యులు తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను కోరారు. ఈ మేరకు రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి ఆయనకు ప్రతిష్టాత్మక గోమాత విగ్రహాన్ని, మెమొంటోను అంజేశారు. ఈ సందర్భంగా గో ఫౌండేషన్ ఛైర్మన్ జస్మత్‌పటేల్, మేనేజింగ్ ట్రస్టీ రిడేష్ జాగిర్దార్, భారతీయ ప్రాణిమిత్ర సంఘం అధ్యక్షులు జస్‌రాజ్ శ్రీమాన్ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు గో సంరక్షణ కోసం వారు చేస్తున్న కార్యక్రమాలు వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ..లవ్ ఫర్ కౌ ఫౌండేషన్ ఇతర జంతు సంరక్షణ సంస్థలను చేపట్టి గోమాత కోసం ప్రతిరోజూ ఒక్క రూపాయి ఆదా చేసేందుకు సంస్థ చురుగ్గా ప్రచారం చేస్తుందన్నారు. అలాగే భవిష్యత్ తరాలకు ఆవును సంరక్షించే విషయాన్ని భావితరాలకు అవగాహన కల్పించేలా కృషి చేస్తున్నామన్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్ ప్రాంతాలలో గోశాలలను సందర్శించాలని గవర్నర్‌ను కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మురళీ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌ను దూషిస్తే సహించం



చామల కిరణ్‌కుమార్‌రెడ్డిపై సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేసిన ఆశీష్‌కుమార్ యాదవ్

అబిడ్స్: మాజీ మంత్రి కేటీఆర్‌ను దూషిస్తే సహించబోమని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్ యాదవ్ అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేని కాంగ్రెస్ నాయకులు కేటీఆర్‌పై అడ్డగోలుగా అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కేటీఆర్‌పైన అసత్య ప్రచారం చేశారని అతనిపై చర్యలు తీసుకోవాలంటూ సీసీఎస్‌లో ఫిర్యాదు చేశామని ఆశీష్‌కుమార్ యాదవ్ తెలిపారు. వ్యక్తిగత ఆరోపణలకు దిగితే కాంగ్రెస్ నాయకులకు బీఆర్‌ఎస్ తడాక చూపిస్తుందన్నారు. రాజకీయంగా ఎవరైనా వ్యతిరేకించవచ్చని, వ్యక్తిగతంగా విమర్శిస్తే బీఆర్‌ఎస్ వారిపై చట్టరీత్య చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ప్రదీప్‌రాజ్, శ్రీనివాస్ గౌడ్, శైలేష్ కురుమ, శ్రీనివాస్ యాదవ్, అనిల్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై వ్యాపారాలు.. పర్యాటకులకు తిప్పలు

- రోడ్లను ఆక్రమిస్తూ వ్యాపారాలు
- ఫుట్‌పాత్‌లు కనిపించకపోవడంతో నడిరోడ్డుపై నడక..
- తప్పని ట్రాఫిక్ ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



గుల్జార్‌హౌజ్-మచిలీకమాన్ రోడ్డులో..

చార్మినార్: పాతబస్తీలోని పర్యాటక ప్రాంతాలన్నీ ఆదివారం రద్దీగా కనిపించాయి. మదీనా-చార్మినార్ ప్రధాన రోడ్డులో ఫుట్‌పాత్‌లే కాదు..రోడ్లు సైతం చిరు వ్యాపారస్తులు ఆక్రమించుకొని నడిరోడ్డుపై వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. నయాపూల్ బ్రిడ్జితో పాటు చార్మినార్ వరకు అసలు ఫుట్‌పాత్‌లే కనిపించవు. ఎవరైనా కాలినడకన చార్మినార్ చేరుకోవాలంటే.. నడిరోడ్డుపై నుంచే తమ నడక కొనసాగించాల్సి ఉంటుంది. ఇలా ఇంకెన్నాళ్లు అని స్థానికులతో పాటు పర్యాటకులు సూటిగా ప్రశ్నిస్తున్నారు. రెగ్యులర్‌గా వ్యాపారాలు చేసే వారిని గుర్తించి వారికి గుర్తింపు కార్డులు పంపిణీ చేసి ఒక ప్లేస్‌ను కేటాయించి క్రమబద్ధీకరించాల్సిన అవసరం ఉందని పాతబస్తీ ప్రజలు కోరుతున్నారు.

అన్నీ నడిరోడ్డు పైనే..

పాతబస్తీలో అన్నీ రోడ్లపైనే దర్శనం ఇస్తాయి. పండ్లు, గాజులు, దుస్తులు, నిత్యావసర సామగ్రి..ఇలా ఒక్కటేమిటి వాహనాల పార్కింగ్ కూడా నడిరోడ్డు పైనే.. పర్యాటకపరంగా, వ్యాపారపరంగా, నివాసపరంగా పాత నగరానికి జనం తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఇక ఆదివారం చార్మినార్ వైపు వెళ్లే రోడ్డులో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉంటుండడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. పూర్తి స్థాయిలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. కాలినడకకు కూడా వీలు కాని పరిస్థితులు ఎదురయ్యాయి.

వీకెండ్‌తో సందడే..సందడి

సాధారణ రోజుల కన్నా..వీకెండ్ అయిన ఆదివారం సందర్శకుల సందడి ఎక్కువైంది. ముఖ్యంగా చార్మినార్ పరిసరాలు సందర్శకులతో రద్దీగా మారాయి. కాలు తీసి కాలు పెట్టలేని దుర్భర పరిస్థితులు ఇక్కడ కనిపించాయి. దీంతో ట్రాఫిక్ సమస్యలు కూడా ఎక్కువయ్యాయి. ఎటువైపు నుంచి వెళ్తే తమ గమ్యస్థానాలకు చేరుకుంటాం..అనే మీమాంసలో వాహనదారులుండిపోయారు. అఫ్జల్‌గంజ్ దాటి నయాపూల్ మీదుగా మదీనా ద్వారా చార్మినార్ వైపు ముందుకురావడం.. మళ్లీ తిరుగు ప్రయాణంలో అఫ్జల్‌గంజ్ వైపు వెళ్లడం ..వాహనదారులకు నరకం కనిపించింది. వాహనాల రాకపోకలు నత్తను తలపించాయి. వాహనదారులకు గుల్జార్‌హౌజ్ వరకు ఆదివారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ట్రాఫిక్ జాం తిప్పలు తప్ప లేదు. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు చార్మినార్ పరిసరాలలో సందర్శకుల రద్దీ విపరీతంగా కనిపించింది.

సన్మానం



సంగంను సన్మానిస్తున్న షోలాపూర్, పండరిపూర్ రైతులు

అబిడ్స్: రైతులకు గిట్టుబాటు ధర ఇచ్చిన ఏజెంట్లను పలువురు రైతులు సన్మానించారు. ఆదివారం మహారాష్ట్రలోని పండరిపూర్, షోలాపూర్‌కు చెందిన రైతులు గుడిమల్కాపూర్ మార్కెట్‌లోని కమిషన్ ఏజెంటు సంగంను సత్కరించి అభినందించారు. పండరిపూర్, షోలాపూర్‌లలో పండించే కద్దు (సొరకాయ) పంటకు కొన్ని సంవత్సరాలుగా ఏజెంటు సంగం గిట్టుబాటు ధర ఇస్తూ తమకు న్యాయం చేస్తున్నారని పలువురు రైతులు ఆయనను సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో కమిషన్ ఏజెంట్లు చీలంపల్లి సురేష్, శ్రీకాంత్, హమాలీ సంఘం నాయకులు అశోక్‌కుల పాల్గొన్నారు.

ఆర్యసమాజ్‌లో ప్రత్యేక పూజలు



విశిష్ట సేవలు అందించిన వారికి సన్మానం చేస్తున్న దృశ్యం

గోల్కొండ: కార్వాన్ కుల్సుంపురాలోని శ్రీ విశ్వాంజనేయ భక్త సమాజం టెంపుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కార్తీక మాసం మహోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. శ్రీ సపరివార ద్వాదశ జ్యోతిర్లింగ దేవాస్థానం కార్వాన్ యువజన సంఘం ఆధ్వర్యంలో కుశలవపురంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రత్యేక అభిషేకం తదితర పూజలు జరిగాయి. ట్రస్ట్ బోర్డు ప్రధాన కార్యదర్శి గురజాల అశోక్‌గౌడ్ ఆలయానికి విశిష్ట సేవలు అందించిన వారికి ప్రశంసా పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో దేవర రాజేశ్వర్, ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ ఠకూర్ జగత్‌సంగ్, కాంగ్రెస్ నాయకుడు కురాకుల కృష్ణ తదితరులున్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగా సభ్యులతో ఈశ్వర్ జ్యోతి తదితరులు

గోల్కొండ: యోగాసనాలతో సంపూర్ణ ఆరోగ్యంతో ఉండవచ్చునని మెహిదీపట్నం సంతోష్‌నగర్ పార్కు యోగా సెంటర ప్రతినిధి ఈశ్వర్‌జోషి అన్నారు. ఆదివారం ఉదయం సంతోష్‌నగర్ పార్కులో మార్నింగ్ వాక్ అనంతరం యోగాసనాల కార్యక్రమం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యోగాకు అన్ని దేశాల్లో అత్యంత ప్రచుర్యం ఉందని అన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ ఆసనాలు వేయవచ్చునని ఆయన అన్నారు.

అయ్యప్ప భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి



పూజలు చేస్తున్న మమతా గుప్తా, సంతోష్‌గుప్తా

అబిడ్స్: అయ్యప్ప భక్తులకు కేరళ ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించాలని గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ కార్పొరేటర్ మమతా గుప్తా, సంతోష్‌గుప్తా అన్నారు. కేరళ ప్రభుత్వం తెలుగు రాష్ట్రాల అయ్యప్ప భక్తులకు మౌలిక వసతులు కల్పించడంతో పాటు బస చేసే వసతులు కూడా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. గోషామహల్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో జరిగిన అయ్యప్ప మహా పడిపూజలో మమతాగుప్తా, సంతోష్‌గుప్తా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ..అయ్యప్ప భక్తుల కోసం హైదరాబాద్ నుంచి మరో వంద రైళ్లను అదనంగా కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలని వారన్నారు.

కుటుంబ సర్వే విజయవంతం చేస్తాం



కార్వాన్‌లో కుటుంబ సర్వే

గోల్కొండ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుటుంబ సర్వేను విజయవంతం చేస్తామని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కురాకుల కృష్ణ అన్నారు. ఆదివారం కార్వాన్ డివిజన్‌లోని గిర్కపల్లి, బంజావాడి తదితర ప్రాంతాల్లో సమగ్ర కుటుంబ సర్వే జరిగింది. అధికారి మహ్మద్ రియాజుద్దీన్ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి కుటుంబ వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా రియాజుద్దీన్ మాట్లాడుతూ.. కుటుంబ సర్వేకు ఇప్పటి వరకు తాను తిరిగిన ప్రాంతాల్లో ప్రజలు సహకరించి తమ వివరాలను నమోదు చేసుకున్నారన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

అఫ్జల్‌గంజ్: 11 కేవీ సబ్జిమండి, కమేళా విద్యుత్ ఫీడర్ల పరిధిలోని సబ్జిమండి, పోస్ట్ ఆఫీస్, దరియాబాగ్, పన్నీపురా, మార్కండేయ భవన్ తదితర ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే మహాలక్ష్మీనగర్, రహీంపురా ఫీడర్ల పరిధిలోని మహాలక్ష్మీనగర్, శివలాల్‌నగర్, కుమ్మర్‌వాడి, మర్వాడి బస్తీ, దూల్‌పేట్, రహీంపుర, కాగజీగూడ, రహీంపురా సీబీఐ క్వార్టర్స్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

గ్రంథాలయంలో విద్యార్థులకు ఉపన్యాస పోటీలు

అఫ్జల్‌గంజ్: 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం అఫ్జల్‌గంజ్‌లోని రాష్ట్ర కేంద్ర గ్రంథాలయంలో వివిధ పాఠశాలల విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న వారోత్సవాల్లో భాగంగా 4వ రోజు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉన్నత పాఠశాల, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతగా సిండికేట్ బ్యాంక్ రిటైర్డ్ మేనేజర్ రాధాకుమార్ వ్యవహరించారు.

చికిత్స పొందుతున్న ఇద్దరి మృతి

సుల్తాన్‌బజార్: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు మృతిచెందిన ఘటన సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.పోలీసుల వివరాల ప్రకారం.. ఎంజీబీఎస్ కాలికబర్‌కు చెందిన రాందాస్ నాయక్వాడే(32) ర్యాపిడో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 15న అర్ధరాత్రి రాందాస్ నాయక్వాడే తన బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. సిరిసిల్ల రాజన్న జిల్లాకు చెందిన చంద్రశేఖర్ (20), యమహా ఆర్15 వాహనంపై అతివేగంగా, నిర్లక్ష్యంగా వచ్చి రాందాస్ బైక్‌ను ఢీకొట్టడంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఇరువురిని వేర్వేరు ఆస్పత్రులకు తరలించగా చికిత్స పొందుతూ రాందాస్, చంద్రశేఖర్ మృతిచెందారు.

ఎక్కడి చెత్త అక్కడే..



గోల్కొండ: పారిశుద్ధ్య పనులు సవ్యంగా జరగకపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. చెత్తను తరలించకపోవడంతో దుర్గంధం వ్యాపించడమే కాక విష జ్వరాలు ప్రబలుతున్నాయి. గోల్కొండ, టోలిచౌకీ డివిజన్లలో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించే అధికారులే లేరు. చెత్త ఎప్పుడు తరలిస్తారో తెలియని పరిస్థితి ఉంది. గోల్కొండ, మోతీదర్వాజా, మోతీ మహల్ చౌరస్తాలో పేరుకుపోయిన చెత్త వద్ద వీధి జంతువులు చేరి దారినపోయే వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. షేక్‌పేట్ సూర్యనగర్ కాలనీ, సమతా కాలనీల్లో సైతం పారిశుద్ధ్య పనులు అటకేక్కాయి. ఎవరికి చెప్పుకున్నా చూద్దాం, చేద్దాం అంటున్నారే తప్ప పారిశుద్ధ్య కార్మికులను తమ కాలనీకి పంపడం లేదని సూర్యనగర్ కాలనీకి చెందిన ఆసీఫ్ హుస్సేన్ సోహెల్ అన్నారు. మరో వైపు టోలిచౌకి చౌరస్తా వద్ద డ్రైనేజీ పైప్‌లైన్ పనులు జరిగే ప్రాంతాలకు చెత్త పేరుకుపోయింది. ప్రధాన రహదారే ఈ విధంగా ఉంటే బస్తీల పరిస్థితి ఏవిధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చునని శంకర్ అనే టోలిచౌకి వాసి అంటున్నారు.

అధ్వాన రోడ్లతో అవస్థలు



న్యూ సత్యనారాయణనగర్‌లో..

గోల్కొండ: గుడిమల్కాపూర్ డివిజన్‌లోని పలు బస్తీలు, కాలనీల్లోని రోడుల అధ్వానంగా మారాయి. భారీ వాహనాల రాకపోకలతో డ్రైనేజీల మ్యాన్‌హోల్స్‌తో పాటు దాని చుట్టూ ఉన్న రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. న్యూ సత్యనారాయణనగర్‌లోని మోహిని ఫంక్షన్‌హాల్ పక్క వీధిలోని రోడ్లు గుంతలమయంగా మారాయి. ద్విచక్ర వాహనాదారులు, పాదచారులు ఈ రోడ్డుపై వెళ్లలేని పరిస్థితి ఉంది. ఈ విషయంపై జలమండలి అధికారులతో పాటు బల్దియా అధికారులకు కూడా ఫిర్యాదులు చేశామని బీజేపీ నాయకుడు గోదా లక్ష్మీకాంత్ యాదవ్ అన్నారు. ఈ రోడ్డు పని తమది కాదు అంటే తమది కాదు అంటూ ఇటూ జలమండలి, అటూ బల్దియా అధికారులు రోడ్డును పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. అధికారులు ఇప్పటికైనా రోడ్డుకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



వేడుకల్లో టీపీసీసీ కార్యదర్శి మణిలాల్ షా

గన్‌ఫౌండ్రీ: ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని టీపీసీసీ కార్యదర్శి మణిలాల్ షా పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్యాత్మిక భావాలు పెంపొందించేందుకు ప్రజల కోసం పలు కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ఆదివారం మహాదేవ్ ఆలయంలో జరిగిన కార్తీక మాసం అంకుట్ పూజల్లో పాల్గొన్నా ఆయన ప్రసంగించారు. అన్ని పండుగలను ప్రభుత్వమే స్వయంగా చేస్తుందన్నారు. ఈ వేడుకల్లో గోవింద్ అగర్వాల్, కైలాష్ కేడియా, శశి మహారాజ్, సునిత గుప్తా తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప మహా పడిపూజ



గౌలిపురా: అంబికానగర్‌లో ఆదివారం కందాడి సునిల్ కుమార్ కన్నె స్వామి ఆధ్వర్యంలో ఉదయం 5 గంటలకు గణపతి హోమం, సత్యనారాయణ స్వామి వ్రతం, అయ్యప్ప స్వామి మహా పడిపూజ, అభిషేకం తదితర పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. శబరిగిరీష సన్నిధానం ఎస్.సర్వేశ్ గురుస్వామి ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమానికి అయ్యప్ప స్వాములు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ఆధ్యాత్మిక పుస్తకాలు రావాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య నిత్యానందరావు, కేవీ రమణాచారి తదితరులు

గన్‌ఫౌండ్రీ: యశస్వినీ సాహితీ సమితి ఆధ్వర్యంలో అష్టావధాని డాక్టర్ బోచ్కర్ ఓంప్రకాష్ రచించిన పలు పుస్తకాల ఆవిష్కరణ సభ ఆదివారం రవీంద్ర భారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య వెలుదండ నిత్యానంద రావు మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో ఆధ్యాత్మిక భావాలు కలిగిన పుస్తకాలు రావాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారులు డాక్టర్ కేవీ రమణాచారి మాట్లాడుతూ..వివిధ అంశాలను పరిశోధించి వాటిని పుస్తక రూపంలోకి తీసుకురావడం ఎంతో అభినందనీయమన్నారు. అంతకు ముందు తిరుపతి వేంకట కవుల నానారాజ సందర్శనం సాహిత్యానుశీలనం, శ్రీ యశస్వినీ, రమణీయ పద్య ప్రకాశం పుస్తకాలను ఆవిష్కరించారు. ప్రముఖ వేదాల గాయిత్రిదేవి, పద్య కవి చింత రామకృష్ణారావులకు పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, ఓయూ తెలుగుశాఖ అధ్యక్షులు ఆచార్య కమలాకర శర్మ, దర్శనం మాసపత్రిక సంపాదకులు వెంకటరమణ శర్మ, ప్రజాపద్యం నిర్వాహకులు అనంతకృష్ణ, యువ భారతి అధ్యక్షులు ఆచార్య ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



మాట్లాడుతున్న ఏసీపీ విజయ్ శ్రీనివాస్

విజయనగర్‌కాలనీ: ఆలయాలు, మసీదుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆసిఫ్‌నగర్ పోలీస్ డివిజన్ ఏసీపీ విజయ్ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మందిర్, మసీదు కమిటీ ప్రతినిధులతో ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ..ఇటీవల పలు ఆలయాల వద్ద జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండా ఆలయాలు, మసీదుల కమిటీ సభ్యులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. బస్తీలు, కాలనీలలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు చోటు చేసుకోకుండా మైత్రి, పీస్ కమిటీ సభ్యులు తమవంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఆసిఫ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ జి.వెంకటేశ్వర్లు, మైత్రి కమిటీ సభ్యులు యాసీన్ అలీ, ప్రధాన కార్యదర్శి అశ్వక్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

గోల్కొండ కోటలో పర్యాటకుల సందడి



గోల్కొండ: గోల్కొండ కోటకు ఆదివారం భారీ ఎత్తున పర్యాటకులు తరలివచ్చారు. వేల సంఖ్యలో తరలివచ్చిన పర్యాటకులతో కోటలోని చారిత్రక ప్రదేశాలు జాతరను తలపించాయి. ముఖ్యంగా నగీనాబాగ్, ఆయుధా గారం, రాణి మహల్ తదితర ప్రాంతాల్లో ఇసుక వేస్తే రాలనంత పర్యాటకులు కానవచ్చారు. కోటలో ప్రవేశించగానే క్లాపింగ్ పోర్టికో వద్ద కోట హిస్టరీ గైడ్స్ కోట విశేషాలను పర్యాటకులకు వివరించారు. మరో వైపు గోల్కొండ కోట బస్టాప్, చౌరస్తా, బడాబజార్ తదితర ప్రాంతాల్లోని వెరైటీ షాపింగ్ స్టాల్స్, యూనిక్ షాపింగ్ స్టాల్స్ కొనుగోలు దారులతో కిటకిటలాడాయి.

అర్హులందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు



ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడుతున్న బంగారి ప్రకాష్

గోల్కొండ: అర్హులందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇప్పించేందుకు కృషి చేస్తానని గుడిమల్కాపూర్ మాజీ కార్పొరేటర్, బీజేపీ నాయకుడు బంగారి ప్రకాష్ అన్నారు. ఆదివారం గుడిమల్కాపూర్ కింగ్స్ ప్యాలెస్ ఫంక్షన్‌హాల్‌ను ఆనుకొని ఉన్న గుడిసెవాసులు డబుల్ బెడ్‌రూమ్‌లు ఇవ్వాలని ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ.. పేదల జీవితాలతో ఆడుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటు అని అన్నారు. చెత్తను ఏరుకునే కార్మికులకు గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్‌లు ఇస్తామని మోసం చేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా ఈ విషయంపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఆయన ఆరోపించారు. బెడ్‌రూమ్‌లపై తమకు హామీ లభించే వరకు ఆందోళన విరమించేది లేదని గుడిసె వాసులు నినాదాలు చేశారు. ఈ విషయంపై తాను మాట్లాడుతానని బంగారు ప్రకాష్ హామీ ఇవ్వడంతో వారు వెనుతిరిగారు.

పేదల ఇళ్లు కూల్చితే ఉద్యమిస్తాం



పేదలతో మాట్లాడుతున్న తల్లోజు ఆచారీ



మాజీ మంత్రి అమర్సింగ్ తిలావత్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

జియాగూడ: సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేయాల్సింది పోయి వారి ఇళ్లను కూల్చివేస్తామంటే ఉద్యమిస్తామని బీజేపీ కల్వకుర్తి కాంటెస్టెడ్ ఎమ్మెల్యే తల్లోజు ఆచారీ అన్నారు. శనివారం రాత్రి జియాగూడ కార్వాన్ మూసీనది పరిసర ప్రాంతాల్లో కార్వాన్ నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జి అమర్‌సింగ్, నగర కార్యవర్గ సభ్యులు గంజి రఘునాథ్‌తో కలిసి గుడిసెవాసులతో మాట్లాడారు. కార్వాన్ డివిజన్ అధ్యక్షుడు దొర్తుల శ్రీనివాస్, కట్ల అశోక్, జియాగూడ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, గోల్కొండ జిల్లా కో కన్వీనర్ శివకుమార్‌యాదవ్, బీజేవైఎం తెలంగాణ రాష్ట్ర కోశాధికారి యోగిరాజ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మూసీ బాధితులకు అండగా బీజేపీ..

దూద్‌బౌలి: మూసీ బాధితులకు బీజేపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మాజీ మంత్రి అమర్ సింగ్ తిలావత్ అన్నారు. మూసీ పరీవాహక ప్రాంతంలో నివసిస్తున్న బాధితులతో ఒక రోజంతా గడిపి పురానాపూల్‌లోని ప్రగతినగర్‌లోని బీజేపీ నాయకుడు కిషన్ లాల్ ఇంట్లో నిద్ర చేశారు. ఆదివారం ఉదయం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దశాబ్దాలుగా నివసిస్తున్న పేద ప్రజల ఇళ్లను ఇప్పుడు వచ్చి కూలగొడతాం రాత్రికి రాత్రి ఖాళీ చేయాలనడంలో అర్థం ఏంటని ఆయన ప్రశ్నించారు. చార్మినార్ నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ ప్రవీణ్ కుమార్, బీజేపీ నాయకులు ఉమామహేంద్ర, కునాల్‌రావు, మీర్ ఫిరాసత్ అలీ బాక్రి, ప్యారసాని వెంకటేష్, కిషన్ లాల్ పాల్గొన్నారు.



బస్తీ నిద్రలో మాజీ ఎమ్మెల్యే ధర్మారావు తదితరులు

కాంగ్రెస్ ప్రజావ్యతిరేక ప్రభుత్వం..

లంగర్‌హౌస్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజావ్యతిరేక ప్రభుత్వం అని బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎం.ధర్మారావు అన్నారు. ఆదివారం ఆయన రాందేవ్‌గూడ, లంగర్‌హౌస్ తదితర ప్రాంతాల్లోని మూసీని ఆనుకొని ఉన్న బస్తీల్లో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ.. బీజేపీ మూసీ ప్రక్షాళన, సుందరీకరణకు పూర్తి వ్యతిరేకం అని స్పష్టం చేశారు. ఒక్క ఇంటిని కూడా కూల్చనివ్వమని ప్రాణాలు అడ్డంగా పెట్టి అయినా సరే కూల్చివేతలను ఆపుతామని ఆయన అన్నారు. ఓబీసీ మోర్చా గోల్కొండ జిల్లా అధ్యక్షుడు చెరుకుల ఉదయ్‌కుమార్, బీజేపీ లంగర్‌హౌస్ డివిజన్ అధ్యక్షులు జి.నాగేందర్‌ప్రకాష్‌రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ ఇంద్రసేనారెడ్డి, భానుప్రకాష్, సి.సంతోష్‌కుమార్ తదితరులున్నారు.

బస్తీ నిద్ర విజయవంతం..

గోల్కొండ: పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు మూసీ ఒడ్డున తాము చేపట్టిన బస్తీ నిద్ర కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని మాజీ ఎమ్మెల్యే ధర్మారావు అన్నారు. ఆదివారం రాత్రి ఆయన కార్వాన్, మూసీ నది ఒడ్డున వారి ఇళ్లల్లో బస్తీ నిద్ర చేపట్టారు. ఆయన వెంట బీజేపీ నాయకులు దేవర వంశీ, ప్రభు పూజారి తదితరులున్నారు.